క్లుప్తంగా

పొలం పనుల్లో రైతన్నలు బిజీ



ఆకుకూరల సాగుకు పొలం సిద్ధం చేస్తున్న రైతులు

కల్లూరు: మండలంలోని రైతులు సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో నైరుతి రుతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలియజేస్తున్నారు. మండలంలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురవడంతో పొలాలు పదునయ్యాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఖరీఫ్ పంటలతో పాటు, బోర్ల కింద ఆకుకూరలు, కూరగాయాల సాగుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

ఘనంగా అమ్మవారి జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామంలో వెలసిన శ్రీ నిదానంపాటి లక్ష్మీబాలత్రిపురసుందరి అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మహిళలు ఉపవాసాలతో మొక్కులు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భీమనాయక్, పీఠాధిపతి సోమశేఖర్‌నాయక్, భజన సంఘం సభ్యులు తదితరుల పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాణ్యం: ఈనెల 22వ తేదీన పాణ్యంలో వ్యక్తి అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ ఆదివారం తెలిపారు. వివరాలు.. హైదరాబాద్ పట్టణం అనీస్ నగర్‌కు చెందిన వి.శంకర్ (74), పసుపులేటి శ్రీనివాసులు మద్యం మానుకునేందుకు పాణ్యంలో ఉన్న సుంకులా పరమేశ్వరి అలయం వద్దకు ఈనెల 22వ తేదీ వచ్చారు. ఆలయంలో ఇచ్చే తాయత్తు, తీర్థం స్వీకరించి అక్కడే విశ్రాంతి తీసుకున్నారు. కొద్దిసేపటికే వి.శంకర్ కనిపించకుండా పోయాడన్నారు. శంకర్ కుమారుడు సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అదృశ్యమైన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీజీహెచ్‌కు సమర్థ అధికారిని నియమించాలి

కర్నూలు(హాస్పిటల్): రాయలసీమ సంజీవనిగా పేరుగాంచిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు సమర్థవైన అధికారిని సూపరింటెండెంట్‌గా నియమించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి బి. రవికుమార్, కన్వీనర్ ఎం. రామకృష్ణారెడ్డి, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఆసుపత్రిలో రాయలసీమ, తెలంగాణా, కర్ణాటక ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 3 వేల మంది రోగులు వైద్యసహాయం పొందుతున్నారన్నారు. ఇలాంటి ఆసుపత్రికి సమర్థవంతమైన కార్యనిర్వహణాధికారి కావాలన్నారు. ప్రస్తుతం సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి త్వరలో పదవీ విరమణ పొందనున్నారన్నారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉండి, ఆసుపత్రి పరిపాలనపై అనుభవం ఉన్న గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని నియమిస్తే బాగుంటుందన్నారు. కోవిడ్ సమయంలోనూ ఆయన సమర్థవంతంగా సేవలందించారని గుర్తు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక బళ్లారి రోడ్డు సెక్షన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్‌లు వస్తుండటం వల్ల వీకర్‌సెక్షన్ కాలనీ ప్రాంతంతో పాటు వివిధ కాలనీలకు నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు.11కేవీ వీకర్ సెక్షన్ కాలనీ ఫీడర్‌లో ఈ కాలనీతో పాటు బిల్డింగ్‌ల సెంటరు, ఉల్చాల రోడ్డు, స్కంద వెంచర్లు, ఆదిత్య నగర్,భ్రమరాంబ నగర్, ఉల్చాల ఏపీ గోదాము, ,కల్లూరు పరిధిలోని రాజీవ్ గృహకల్ప ప్రక్కన బోసిరెడ్డి కాలనీ, లెప్రసి కాలనీ, ఎలుకూరు బంగ్లా, శిల్పనందనవనం, సిద్దార్థ హోమ్స్ తదితర ప్రాంతాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని..వినియోగదారులు సహకరించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఆశలన్నీ ఖరీఫ్‌పైనే..

- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్న
- పంట నష్టపరిహారం జమతో రైతుల్లో మరింత ఉత్సాహం
- మండలంలో 12వేల హెక్టార్లలో సాగు లక్ష్యం
- మండలానికి 5 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయింపు

తొలకరి వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనాలు కూడా అందిస్తుండడంతో పొలాలను దుక్కులు చేసుకుంటున్నారు. ఇప్పటికే కొందరు రైతులు పొలాలను దుక్కిదున్ని సాగుకు సమాయత్తమయ్యారు. మరికొందరు పొలాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గతేడాది వర్షాభావంతో పంటలు చేతికి రాక చితికిపోయారు. ఈ ఏడాదైనా మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆశగా ఎదురుచూస్తున్నారు.



కోడుమూరులో పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతన్న

కోడుమూరు రూరల్: గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన పంటలన్నీ ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికే ముందే భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులంతా ఖరీఫ్‌పైనే ఆశలు పెట్టుకుని పత్తి, వేరుశనగ, కొర్ర, కంది, ఆముదం, మొక్కజొన్న, సజ్జ వంటి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 12 వేలకు పైగా హెక్టార్లలో పంటల సాగు చేయాలన్న లక్ష్యాన్ని వ్యవసాయాధికారులు నిర్దేశించారు.

రైతన్నకు అందుబాటులో విత్తనం

ముందస్తుగా కురుస్తున్న వర్షాలతో రైతులంతా పొలాలు దుక్కిదున్ని సిద్ధం చేసుకుంటుండగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుగానే సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను మండలానికి 5వేల క్వింటాళ్లను కేటాయించింది. దీంతో ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అవసరమైన రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకుని విత్తనాలను కొనుగోళ్లు చేస్తున్నారు. క్వింటాల్ వేరుశనగ విత్తనాలు రూ. 9,500 ఉండగా, ప్రభుత్వం 40 శాతం రాయితీ (రూ.3,800) పోను రైతు రూ.5,700 చెల్లించాల్సి ఉంటుంది.

పంట నష్టపరిహారం జమ

గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల సాగు చేసిన పత్తి, ఉల్లి, కంది, జొన్న, సజ్జ, ఆముదం పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించింది. పంటలు నష్టపోయిన రైతులకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు నష్టపరిహారాన్ని మంజూరు చేశారు. అయితే టీడీపీ నేతలు ఎన్నికలు ముగిసే వరకు రైతుల ఖాతాల్లో జమ చేయరాదంటూ ఈసీకి ఫిర్యాదులు చేసి అడ్డుకున్నారు. దీంతో ఎన్నికలు ముగిసినానంతరం ఈనెల 18వ తేదీ కోడుమూరు మండలంలో 13,901 మంది రైతులకు రూ.12,91,98,781 పరిహారం మంజూరయ్యాయి. నగదుతో ఈ ఏడాది పంటల సాగుకు అవసరమైన పెట్టుబడులు చేతికందాయంటూ రైతులు ఉత్సాహంగా పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.



ప్యాలకుర్తిలో ఆర్‌బీకే నుంచి వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేసి తీసుకెళుతున్న రైతన్న

పెట్టుబడికి నగదు సమకూరింది



గత ఏడాది 5 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసి నష్టపోయాను. అయితే పంట నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిహారం మంజూరు చేయడం సంతోషంగా ఉంది. మంజూరైన నగదు రూ.34 వేలు గత వారం నా బ్యాంకు ఖాతాలో జమైంది. ఈ ఏడాదిలో ఖరీఫ్‌లో పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నా. వర్షాలు కురుస్తుండడంతో పంటలు బాగా పండుతాయని ఆశిస్తున్నా. –మహేశ్వరరెడ్డి, రైతు, వెంకటగిరి గ్రామం, కోడుమూరు

విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులంతా ఖరీఫ్ సాగుకు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తన కొనుగోలు సమయంలో రశీదు తప్పని సరిగా తీసుకోవాలి. విత్తన సంచి, ట్యాగ్‌ను పంట కాలం చివరి వరకు భద్రంగా ఉంచుకోవాలి. పంట సాగు చేసే ముందే మొలక శాతాన్ని పరీక్షించుకుని ఏదైనా సమస్య ఉంటే మండల వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. –రవిప్రకాష్, ఏఓ, కోడుమూరు

కూచిపుడి నాట్యంలో ప్రతిభ



నిర్వాహకుల చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందుకుంటున్న బాలికలు

ఆదోని అర్బన్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాశి (కాశీ)లో తాండవ కృష్ణ భారతీయ నృత్యోత్సవ్ ఆధ్వర్యంలో కాశీ నృత్య మహోత్సవం కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదోని పట్టణానికి చెందిన శ్రీ గురుకృప నాట్యాలయం నుంచి బాలికలు మనోజ్ఞ, మహతి కూచిపుడి నృత్య ప్రదర్శన చేసి అందరినీ అలరించారు. వివిధ రాష్ట్రాల నుంచి కూచిపుడి, భరతనాట్యం, జానపదం, పేరణి, మోహినినాట్యం, ఆంధ్ర నాట్యం, కథాకళి, ఒడిస్సా, మణిపురి, కోలాటం కళాకారులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన బాలికలు నృత్య ప్రదర్శన చేసి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు, దర్శకుడు నవీన్‌కుమార్ గట్టు, కార్యక్రమ నిర్వాహకులు నాట్యశ్రీ, ఉదయశ్రీ, మనోజ్, గురువు వీరజ్‌రాయల్ పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని లక్ష్మీపురం రిడ్జ్ పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఫైనల్‌లో లక్ష్య ఫుట్‌బాల్ సెంటర్ జట్టు నిజామాబాద్ మహిళల ఫుట్‌బాల్ జట్టుతో తలపడి 4–3 స్కోర్‌తో విజయం సాధించింది. అనంతరం అతిథులు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్‌సంఘం జిల్లా అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ పాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న సద్దల సూర్యనారాయణ రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని కొండజూటూరు గ్రామంలో సీఎస్‌ఐ చర్చి ప్రారంభోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా హోమ్ టీమ్ కబడ్డీ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. గెలుపోటలమును సమానంగా స్వీకరించాలన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 20 జట్లు పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు. పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. విజేతలుగా నిలిచిన జట్లకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందించనున్నారు. క్రీడలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. చర్చి నిర్వాహకులు క్రీడాకారులకు, చర్చిని సందర్శించేందుకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించారు. చర్చి సంఘ పెద్దలు, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



కుమారస్వామిని సన్మానిస్తున్న ఆరోగ్యభారతి సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆరోగ్యభారతి క్షేత్ర సంఘటనా కార్యదర్శి కుమారస్వామి చెప్పారు. ఆరోగ్యభారతి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భరతమాత టెంపుల్ వద్ద ఆరోగ్య భారతి అభ్యాసక వర్గ కార్యకర్తలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీజనల్ వ్యాధులపై జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, దంత రోగాలు, చికిత్సపై డాక్టర్ అశ్విని, వంటింటి ఔషధాలు, గృహవైద్యంపై జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, ప్రసూతి స్త్రీ రోగాలపై డాక్టర్ ఎస్.వెంకటరమణ, యోగాపై యోగాగురువు అనురాధ, సంతాన సాఫల్యంపై డాక్టర్ బి. విశ్వనాథ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యభారతి ప్రాంత కార్యదర్శి డాక్టర్ ఎండీపీఎన్ రామశర్మ, జిల్లా కార్యదర్శి బి. సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవేణి, మహేష్, శేఖరగుప్త, మల్లికార్జున, రాఘవేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి సచ్చిదానంద జన్మదిన వేడుకలు



హోమం చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): గణపతి సచ్చిదానంద స్వామీజీ జన్మదిన వేడుకలను సూర్య దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని స్వామి వారి పాదుకలకు సుగంధద్రవ్య జలాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చన, మహా మంగళహారతి, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమం, ఆయుష్యహోమం, ఆదిత్య హృదయ హోమం, మహా పూర్ణాహుతి జరగడంతో వేలదిగా భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రుల య్యారు.

ఉత్తరం.. మధుర జ్ఞాపకం

- ఆధునికతలో తెరమరుగు
- లేఖలు లేక తపాలా పెట్టెలు వెలవెల
- స్మార్ట్‌ఫోన్‌తో వెనుకటి వైభవానికి చెల్లుచీటీ



హెడ్ పోస్టాఫీస్ కర్నూలు

కర్నూలు (న్యూటౌన్): గతంలో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా ఒకరికొకరికి సంభాషణ జరిగేది. దసరా, సంక్రాంతి, దీపావళి పండుగల సంగతి నుంచి, అన్ని సంఘటనల వైనాలను జాబుల్లో నిక్షిప్తం చేసేవారు. తమకు నచ్చే జాబులను ఆసక్తిగా చదువుకునే వారు. వచ్చిన జాబులన్నింటినీ భద్రంగా దాచుకునేవారు. గుర్తుకు వచ్చినప్పుడు తీసి చదువుకుని జ్ఞాపకాలను నెమరువేసుకునేవారు.

సాంకేతిక విప్లవం జోరందుకున్న కొద్దీ నేటితరం ఉత్తరాలంటే తెలియని స్థితిలో ఉంది. స్మార్ట్ ఫోన్ హోరులో లేఖ మనుగడకు ముప్పు ఎదురవుతోంది. విద్యార్థులు లేఖలు రాసేలా పాఠశాల స్థాయిలో ప్రోత్సహించకపోగా తర్వాత కూడా వీటి అవసరం లేదన్న దోరణి కనిపిస్తోంది. 24 గంటలూ స్మార్ట్‌ఫోన్‌తో అరకొర సందేశాలు పంపడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటున్న యువత లేఖ ప్రాధాన్యతను, అందులో ఆనందాన్ని తెలుసుకోలేకపోతోంది.

ఇప్పటి తరం.. స్మార్ట్ రంగం

సాంకేతిక రంగం విరాజిల్లుతున్న ఈ రోజుల్లో పాత జ్ఞాపకాల సంగతి పక్కన పెడితే.. ఎటువంటి సమాచారమైనా క్షణాల్లో చేరుతుందనేది కొందరి వాదన. ఇప్పటి రోజుల్లో ఉత్తరాన్ని పోస్ట్ చేస్తే నాలుగైదు రోజుల తర్వాత చేరేది. కానీ ప్రస్తుతం క్షణాల్లోనే సమాచారం వస్తోందని పలువురు చెబుతున్నారు.



ఉత్తరాలు (ఫైల్ ఫోటో)

అద్భుతమైన జ్ఞాపకం



తల్లిదండ్రులతో కష్టసుఖాలు, అనుభవాలను పంచుకుంటే అదో అద్భుతమైన తీపిగుర్తు. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగే కొద్దీ కలం, కాగితాన్ని పక్కన పెట్టి స్మార్ట్‌ఫోన్లకు పని చెబుతున్నారు. ప్రతి చిన్న విషయానికి వాట్సాప్, ఫేస్‌బుక్, సెల్‌ఫోన్ మెసేజ్‌ల ద్వారా చేరవేస్తున్నారు. – జి.జనార్థన్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, కర్నూలు డివిజన్

సాంకేతికతతో పెరిగిన నేరాలు



సాంకేతికత అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో అందుకు తగ్గట్టు నేరాలు, ఘోరాలు అదే రీతిన జరుగుతున్నాయి. ముఖ్యంగా యువతీ, యువకులు చెడు వ్యసరాలకు బానిసలవుతున్నారు. అలాగే స్మార్ట్‌ఫోన్‌తో విద్యార్థుల చదువుకు సంబంధించి అన్ని విషయాలు లభిస్తున్నాయి. గతంలో పుస్తకాలు లభించక చెప్పులరిగేలా తిరిగేవారు. ఇప్పుడు ఆ దుస్థితి లేదు. సాంకేతిక అభివృద్ధి చెందడంతో గతంలాగా బ్యాంకులకు వెళ్లాల్సిన పని లేకుండా పోయింది. దాచుకున్న డబ్బు తీసుకోవాలంటే బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. – హఫీజ్ అబ్దుల్లా, ముస్లిం మత గురువు, కర్నూలు

ఉత్తరం అదో తీపి గుర్తు



మనలోని భావాల్ని ఎదుటి వారికి నేరుగా చెప్పలేని విషయాలను ఉత్తరాల ద్వారా చక్కగా వివరించవచ్చు. ఉత్తరం ఓ మధుర జ్ఞాపకం. మన తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, ఇలా ఎవరికి రాసినా అదొక తీపి గుర్తు. లేఖలు భాషపై పట్టు పెంచుతాయి. ఈ విషయాన్ని నేటి తరం యువత గుర్తించాలి. మళ్లీ ఉత్తరాలు రాసే సంస్కృతిని తీసుకురావాలి. – డాక్టర్ మీనిగ శ్రీనివాసులు, కర్నూలు

గొప్ప సంస్కృతి




లేఖలు రాయడం గొప్ప సంస్కృతి, చాచా నెహ్రూ జైల్లో ఉన్నప్పుడు ఇందిరాగాంధీకి ఉత్తరాలు రాశారు. అది ఆమెను ఎంతో ప్రేరేపించింది. మనం చెప్పాలనుకున్న విషయాలను, ఆలోచనలు, భావాలను ఫోన్ల ద్వారా చెప్పడం కంటే ఉత్తరాల్లో చక్కగా రాసి పంపవచ్చు. నేను చిన్నప్పటి నుంచి కళాశాలల్లో చదివే వరకు లేఖలు రాసి, స్నేహితులు, బంధువుల క్షేమ సమాచారాన్ని తెలుసుకునేవాడిని. ఇప్పటికీ వాటిని దాచుకున్నాను. – వెంకటేష్ నాయక్, తహసీల్దార్

బాల్యం నుంచి అలవాటు



చిన్నప్పటి నుంచి స్నేహితులు, బంధువులకు ఉత్తరాలు రాస్తూ ఉండేవాడిని. దసరా, సంక్రాంతి, దీపావళి సెలవులు వచ్చాయంటే చాలు ఉత్తరాల ద్వారానే సంభాషణలు సాగేవి. అందుకే ఉత్తరాలు రాయడం అంటే నాకు చాలా ఇష్టం. నా స్నేహితులు పంపిన ఉత్తరాలు నేటికీ పదిలంగా దాచుకున్నాను. – రంగస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కర్నూలు



విపరీతంగా పెరిగిన గుర్రపుడెక్కతో పచ్చగా మారిన కేసీ కెనాల్

పంట చేను కాదు.. గుర్రపు డెక్క



చెత్త, వ్యర్థాలను కేసీ కెనాల్‌లో వేసిన దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహం నిలిచిపోవడంతో విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్కతో ఆ ప్రాంతమంతా ఆకుపచ్చగా మారిపోయింది. కాలువ అడుగు భాగం కనిపించని విధంగా గుర్రపుడెక్క పరచుకుని పంట చేనును తలపిస్తోంది. దీంతో కేసీ కెనాల్ మీదుగా వెళ్లే ప్రయాణికులంతా ఆకుపచ్చగా మారిన కాలువను ఆశ్చర్యంగా చూస్తూ వెళ్తున్నారు. నీటి ప్రవాహం లేకపోవడంతో గుర్రపుడెక్క పెరిగి దోమలకు ఆవాసంగా మారింది. ఒక వైపు గుర్రపుడెక్క పెరగడం, మరోవైపు నీటి ప్రవాహం లేకపోవడం వల్ల చెత్తాచెదారాన్ని కేసీ కెనాల్‌లో వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చీకటిపడితే చాలు ఇళ్లలోకి దోమలు స్వైర విహారం చేస్తూ కర్నూలు నగర ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మరోవైపు దోమల వల్ల రోగాలబారిన పడుతున్నామని నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటి పారుదల శాఖ అధికారులు, కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు స్పందించి కేసీ కెనాల్‌లో విపరీతంగా పెరిగిన గుర్రపుడెక్కను, చెత్తాచెదారాన్ని తొలగించాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చెన్నకేశవుడి రథోత్సవం

అవుకు: మండల కేంద్రం అవుకులో తిరుకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అవుకు రాజవంశీయులు త్రివిక్రమవర్మ, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఉత్సవ మూర్తులకు పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. తేరు వీధి నుంచి రాజా వీధి మీదుగా మండపం వీధి వరకు రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు.

గాలీవానపై అప్రమత్తంగా ఉండాలి



గొల్లలదొడ్డిలో ఈదురు గాలులకు కూలిన విద్యుత్ స్తంభం



బురాన్‌దొడ్డిలో విరిగిపడిన విద్యుత్‌స్తంభాలు

సి.బెళగల్: మండల ప్రజలు గాలివానలపై అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్ ఏఈ సుకుమార్ అన్నారు. ఆదివారం విద్యుత్ ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేశారు. వారం రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలకు సుమారు 90కి పైగా విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయని తెలిపారు. 20 వరకు ట్రాన్స్‌ఫారమ్స్ విరిగి పడ్డాయని, వాటి మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయని అన్నారు. అయితే మండల రైతులు, ప్రజలు వీధులు, పొలాల్లోకి వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినట్లు కనిపిస్తే అటువైపు వెళ్లవద్దని సూచించారు. తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.